అభివృద్ధిని చూసి ఓటేయండి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


మొగుళ్లపల్లి: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మొగుళ్లపల్లి మండలంలోని ఆకినపల్లి, ఇప్పలపల్లి, పోతుగల్లు, కోర్కిశాల, మొగుళ్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా ఆశీర్వాద యాత్రను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయాల్లో పూర్తి స్థాయిలో ఉన్నానని, సరదా సరదాగా రాజకీయాలు చేయడం కోసం రాలేదన్నారు. భూపాలపల్లి మొదటి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనేక సమస్యలతో ఈ నియోజకవర్గం ఉండేదని, ఆ విషయాన్ని ప్రజలు గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తర్వాత ఒక్కొక్కటిగా పూర్తి చేసుకొని ఇప్పుడే ఓ స్థాయిలోకి చేరుకున్నామన్నారు. రైతులకు పంట పెట్టుబడి సాయం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. వైద్య రంగంలో గణనీయమైన అభివృద్ధి జరగాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, గ్రామాల్లో సబ్ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేసి ఆరోగ్య తెలంగాణగా ఈ రోజు రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచినట్లు తెలిపారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం సాధించిన తెలంగాణలో గడిచిన పదేళ్లలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ధరణి తీసుకువచ్చి రైతు భూముల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అలాగే తిరిగి మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడితే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. విజ్ఞులైన ప్రజలు ఒక్కసారి ఆలోచించి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోడారి రమేష్, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

భూపాలపల్లి రూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ.. మున్సిపల్ పట్టణంలోని సుభాష్‌కాలనీలో 17వ వార్డు కౌన్సిలర్ ముంజపల్లి మురళి, 16, 29వ వార్డుల ఇన్‌చార్జ్‌లు బైరెడ్డి లక్ష్మారెడ్డి, అల్లూరి కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, పార్టీ మేనిఫెస్టోను కాలనీవాసులకు వివరిస్తూ.. బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో అర్బన్ బీసీ సెల్ అధ్యక్షుడు చుక్క బాలరాజుగౌడ్, నాయకులు రమేష్, గోగుల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కట్ట నరసింహచారి, దాసరి బ్రహ్మారెడ్డి, భాస్కారి సత్యనారాయణ, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: ప్రచారం చేస్తున్న వెంకటరమణారెడ్డి

ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలి

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ నిర్వహించనున్న ఈ సభకు మండలంలోని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.


భూపాలపల్లి రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


శాయంపేట: మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

రేషన్‌కార్డు, ఇళ్లు ఇవ్వని బీఆర్‌ఎస్ సర్కార్


రఘునాథపల్లి: ఫతేషాపూర్‌లో మాట్లాడుతున్న సింగపురం ఇందిర


ఇబ్రహీంపూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారితో ఇందిర

- కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర

రఘునాథపల్లి: పదేళ్లలో కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లు ఇవ్వని దౌర్భాగ్య బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, మల్లంపల్లి, శివాజీనగర్, ఖిలాషాపూర్, కంచనపల్లి ఆశీర్వాద సభల్లో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాలను ప్రభుత్వం లాక్కోవడం సిగ్గుచేటన్నారు. దళితబంధు, గృహలక్ష్మి కమీషన్ల మయమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరితో యువకులకు ఉద్యోగాలు రాక రోడ్డున పడ్డారని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, జిల్లా నాయకులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్, గొట్టం భాస్కర్‌రెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి, పోకల శ్రీనివాస్, చింత నరేష్, మోర్తాల ప్రభాకర్, ఎండీ గౌస్‌మియా, మేడిపల్లి నరేష్, ఎండీ యాకుబ్, ఎండీ హయత్ అలీ, పేర్ని ఉషారవి, ఎండీ షబ్బీర్, కర్ణాకర్‌రెడ్డి, యామంకి శ్రీను, నామాల నాగరాజు, ముప్పిడి శ్రీధర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

మండలంలోని ఇబ్రహీంపూర్‌లో ఇందిర సమక్షంలో బీఆర్‌ఎస్ వార్డు సభ్యుడు గిరబోయిన సతీష్‌తో పాటు దొరగొల్ల సత్తయ్య, దొరగొల్ల కుమార్, మల్లయ్య, నూనె చిన్నఉప్పలయ్య, శివార్ల కుమార్, శివార్ల శ్రీను, మల్లేష్, మహేందర్, మహేష్, ఉల్లోజు శ్రీను, రాజు, నరేష్, శ్రీధర్, కనకరాజు, ప్రశాంత్, మధు, సిద్దులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఇందిర కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఫతేషాపూర్‌లో బీఆర్‌ఎస్ నుంచి గడ్డం సందీప్, భాస్కర్, లోకేష్, ప్రశాంత్, సునీల్, వీరస్వామి, జహంగీర్, శ్రీనివాస్, రఘుపతి, శ్రీలత తదితరులు ఇందిర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఇందిరకు టీడీపీ మద్దతు

జఫర్‌గఢ్: సింగపురం ఇందిరకు జఫర్‌గఢ్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. కాసర్ల ఏలీయా, మొట్టక ఎల్లయ్య, గాడబోయిన బిక్షపతి, నీలం సాగరం, నల్లతీగల బాలయ్య ఉన్నారు.

ఇందిర తరఫున కుతూరు ప్రచారం

సింగపురం ఇందిరను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కేంద్రంలో ఆమె కుమార్తె అర్పిత ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట


స్టేషన్‌ఘన్‌పూర్: అభివాదం చేస్తున్న కడియం శ్రీహరి, ఐలయ్య తదితరులు


చిల్పూరు: గేమ్యతండాలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న కడియం శ్రీహరి

- అందుబాటులో ఉండని వారికి ఓటేస్తే అధోగతే
- బీఆర్‌ఎస్ ఘన్‌పూర్ అభ్యర్థి 'కడియం'

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని ఆ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. డివిజన్‌కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఎస్‌ఆర్‌కేఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల భవన నిర్మాణ రంగాల కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, కార్మికులకు ప్రమాద బీమా రూ.6.30లక్షలు, సాధారణ బీమా రూ.లక్ష 30వేలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్నగుప్తా, మారుజోడు రాంబాబు, బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే అలీ తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరికే ముదిరాజ్‌ల మద్దతు

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికే తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ నీల రాజు, జిల్లా డైరెక్టర్ బూర్ల శంకర్ అన్నారు. మండలంలోని రాఘవాపూర్, మీదికొండ, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ముదిరాజ్ మత్స్యసొసైటీల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్, బీజేపీలు మాదిగల శత్రువులు

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మాదిగలకు శాశ్వత శత్రువులని, అంబేద్కర్, పూలే ఆశయ సాధన కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడ స్వామి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.


ఖాజానగర్‌తండా ప్రచారంలో కడియం

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

తెలంగాణలో సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతిగా పనిచేస్తున్నారని, బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికే బీఆర్‌ఎస్ కార్మిక విభాగం సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం అన్నారు. డివిజన్ కేంద్రంలో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) మండల అధ్యక్షుడు సున్నం యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తండాలను అభివృద్ధి చేస్తా..

జఫర్‌గఢ్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తండాలను అభివృద్ధి చేస్తానని కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని పలు తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాలకు చెందిన గిరిజనులు కడియం శ్రీహరికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి పలువురు

మండల కేంద్రదానికి చెందిన కాంగ్రెస్ మండల మైనార్టీ నాయకుడు ఎండీ హబీబ్‌ఖాన్..కడియం శ్రీహరి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అందుబాటులో ఉండని వారికి ఓటువేస్తే అధోగతే

నియోజకవర్గంలో అందుబాటులో ఉండని వారికి ఓటు వేస్తే అధోగతేనని, అభివృద్ధికి పాటుపడే తనను గెలిపించాలని కడియం శ్రీహరి కోరారు.


కడియం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన హబీబ్‌ఖాన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నపెండ్యాల, దేశాయితండాల పంచాయతీల పరిధిలోని గేమ్యతండా, సీతతండాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించిన నెల రోజుల్లో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. గ్రంథాలయ, చిల్పూరు ఆలయ చైర్మన్‌లు కృష్ణారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ సరిత బాలరాజు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కడియం శ్రీహరిని గెలిపించాలని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు లింగారెడ్డి, లొడెం రజితరవీందర్, రాజ్‌కుమార్, ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ అయిలమ్మ ఎల్లయ్య, నాయకులు ఎంపీపీ సరితబాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కడియం గెలుపునకు కృషి

కడియం శ్రీహరి గెలుపునకు గౌడ, కల్లుగీత కార్మిక సంఘం పూర్తి స్థాయిలో కృషిచేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

పల్లగుట్టలో అన్ని కులాలు కడియం వైపే..

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరికే పల్లగుట్టలోని అన్ని కులాలు పూర్తి మద్దతు ఇస్తాయని చిల్పూరు ఆలయ చైర్మన్, క్లస్టర్–4 ఇన్‌చార్జ్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన వివిధ కులాల నాయకులు బుధవారం శ్రీధర్‌రావు, గౌడ సంఘం నాయకుడు చిర్ర నాగరాజు ఆధ్వర్యంలో కడియం శ్రీహరిని కలిసి పూర్తి మద్దతు తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీజేపీని ప్రజలు ఆదరించాలి


భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న కీర్తిరెడ్డి


మొగుళ్లపల్లి: మొట్లుపల్లిలో ప్రచారంలో చేస్తున్న కీర్తిరెడ్డి

- ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: అన్ని వర్గాల ప్రజలను మోసగించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పి బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి, గుడాడ్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. బీజేపీ ద్వారానే అన్ని వర్గాల వారికి లాభం చేకూరుతుందని అభివృద్ధి, సంక్షేమం, డబుల్ ఇంజన్ సర్కార్ వల్లనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలో ఓటర్లంతా బీజేపీ వైపు నిలుస్తున్నారన్నారు. కాంగ్రెస్ బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు సుస్థిర పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు విష్ణు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మొట్లుపల్లి, గుండ్లకర్తితో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శేషగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం..

కీర్తిరెడ్డి గెలుపును కోరుతూ.. మున్సిపల్ పట్టణంలోని 30 వార్డుల్లో వార్డుల ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి కేంద్రం అందించే సంక్షేమ పథకాలతో పాటు, బీజేపీ మేనిఫేస్టోను ఓటర్లకు వివరిస్తు ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులను నమ్మొద్దు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు.

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలంతా బీజేపీకి ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల మాదిగల ఆకాంక్ష నేరవేరే సమయం వచ్చిందని బీజేపీకి ఓటు వేయాలని కోరారు. తిరుపతి, బొల్లి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ ఆకలి బతుకులే


పరకాల : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి


గీసుకొండ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్లా ధర్మారెడ్డి

- బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి
- పట్టణంలో ఎన్నికల ప్రచారం

పరకాల: అధికార పీఠం ఎక్కేందుకు అర్థంలేని మేనిఫెస్టోతో ప్రజల వద్దకు వస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే మళ్లీ ఆకలి బతుకులు వస్తాయని పరకాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోచమ్మ తల్లి, కనకదుర్గ దేవతలకు పూజలు చేశారు. అక్కడిన నుంచి బయలుదేరిన ధర్మారెడ్డికి మహిళల మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా రాంనగర్, పాత బొడ్రాయి, బీసీ కాలనీ సెంటర్‌ల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దేశం గర్వించదగ్గ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు పారదర్శకంగా అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు దమ్ముంటే వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేస్తున్న హామీలను నెరవేర్చి తెలంగాణకు రావాలని సవాల్ విసిరారు. డిసెంబర్ 3 తర్వాత కాంగ్రెస్, బీజేపీ అడ్రస్‌ల గల్లంతు అవడం ఖాయమన్నారు. పరకాలలో ఒక్కసారి పోటీ చేసిన వారు మళ్లీ నియోజకవర్గంలో కనిపించడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలోని ఊర్లు, పేర్లు తెలియని ప్యారాషూట్ నాయకులు మళ్లీ వచ్చారని, ఇదివరకు పరకాల ప్రజలకు ఏం చేశారో వారు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం బరిలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితరామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హైమావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

ఆత్మకూరు : నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి మూడోసారి ఆశీర్వదించి గెలిపించాలని పరకాల బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి కోరారు. మండలంలోని పెంచికలపేటలో బుధవారం ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శివాలయంలో, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు పరకాల నియోజకవర్గంలో రోడ్లు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలు గమనించాలన్నారు. పదేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మార్చి గొప్పగా అభివృద్ధి చేశామన్నారు.


ఆత్మకూరు : ఇంటింటా ప్రచారం చేస్తున్న జ్యోతి

బీఆర్‌ఎస్‌లో చేరిక

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంకు చెందిన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గోదాసి రాజ్‌కుమార్(చిన్న)తో పాటు అతడి అభిమానులు, అనుచరులు, బీజేపీ నాయకులు పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరకాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలోని రజక సంఘం నాయకులు పరకాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు.

సంక్షిప్త సమాచారం

గుడుంబా స్వాధీనం


పట్టుకున్న గుడుంబాతో పోలీస్‌లు

ఆత్మకూరు : మండలంలోని పెంచికలపేటలో సీఐ రవిరాజు సిబ్బందితో కలిసి బుధవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 150 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడిన నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన ఇస్లావత్ సక్రు, ఇస్లావత్ కోమలతో పాటు పెంచికలపేటకు చెందిన రాధారపు చుక్కయ్య, రాధారపు బాపు, రాధారపు రాధ, రాధారపు మార్తను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రాజేష్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ఖలీం, హోంగార్డు కరుణాకర్ దాడుల్లో పాల్గొన్నారు.

పరిమితి మించొద్దు

పరకాల: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పరిమితికి మించి మద్యం విక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు మద్యం దుకాణాదారులను హెచ్చరించారు. పట్టణంలో మద్యం దుకాణాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎక్సైజ్ ఎస్సై పద్మ, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి, కానిస్టేబుళ్లు రవీందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

మొదలైన హోం ఓటింగ్

నడికూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో హోం ఓటింగ్ బుధవారం ప్రారంభమైంది. 54 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా, 51 మంది హోం ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

మాజీ ఎంపీపీపై ఎంపీపీ ఫైర్

పరకాల: తాను ఎంపీపీగా అయినప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పక్షపాతంగా వ్యవహరిస్తున్నాడని, కొందరి మాటలు విని అభివృద్ధికి నిధులు కూడ మంజూరు చేయలేదని ఎంపీపీ స్వర్ణలత మండిపడ్డారు. మండలంలోని వెల్లంపల్లిలో కాంగ్రెస్ ప్రచారంలో ఆమె కన్నీరు పెట్టారు. తనను చెల్లని రూపాయి అంటూ మాజీ ఎంపీపీ భర్త నేతాని శ్రీనివాస్‌రెడ్డి అనడం అతని అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. దళితురాలని తనను చిన్న చూపు చూస్తూ అవహేళన చేస్తున్న నేతాని శ్రీనివాస్‌రెడ్డికి చెప్పుదెబ్బలు తప్పవన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలి

శాయంపేట : మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి, భూపాలపల్లి జిల్లా ఎన్నికల నోడల్ అధికారి విజయ్‌భాస్కర్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.